కథ

# పరివర్తన

పుష్యమాసపు రోజులు కావడంతో ఉదయం పదిగంటలైనా చలి తగ్గలేదు. అవధాని అప్పుడే దేవతార్చన ముగించుకొని వరండాలోని అరుగుమీద కూర్చొని వ్యాసపీఠంలో ఉంచిన భాగవతాన్ని పారాయణ చేస్తున్నాడు. తూర్పు నుంచి సూర్యుని వాడి వేడి కిరణాలు ఆ వరండాలో పడుతూ కాస్తంత వెచ్చదనాన్ని కలుగజేస్తున్నాయి. ఆ సమయంలో ప్రతినిత్యం ఏదో పురాణాన్ని పారాయణం చేయడం అతని నిత్యకృత్యం. అలా పారాయణచేస్తూ కొద్దిసేపటికి ప్రక్కనే ఉన్న మంచంమీదకు చేరి నిద్రలోకి జారుకున్నాడు.

అవధాని భార్య జానకి సూర్యోదయానికి ముందే లేస్తుంది. దగ్గర్లోనే తూర్పు వాహినిగా పారుతున్న ఏటికి వెళ్లి స్నానం చేసి మడిగా నీళ్లుతెచ్చి దేవతార్చనకు ముందే మహానైవేద్యం కోసం వంట చేస్తుంది. ఆ మహానైవేద్యం పూర్తైన తరువాతే ఆమెకు విశ్రాంతి. అంతవరకు అలా తడిబట్టల్లో మడిగా ఉండవలసిందే! ఈ దినచర్య ఆమెకు నలభై సంవత్సరాల క్రితం కోడలుగా ఆ యింట అడుగుపెట్టినప్పట్నుంచీ అలవాటు; మొదట్లో మడివంటలో అత్తగారికి సాయం చేస్తే, ఆవిడ తదనంతరం తాను ఆ బాధ్యత స్వీకరించింది.

అవధాని, జానకి దంపతులకు ఇద్దరే పిల్లలు. పెద్ద పిల్ల భానుని డిగ్రీ పూర్తైన తరువాత తన మేనల్లుడికిచ్చి వివాహం చేశారు. అతను ముంబాయిలో యింజనీరుగా పనిచేస్తున్నాడు. వాళ్లకి యిద్దరు పిల్లలు. ఇక కొడుకు భరద్వాజ బిట్స్ పిలానీలో యింజనీరింగ్ పూర్తి చేసి అమెరికాలో ఒక మల్టీ నేషనల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వాళ్లకి కూడా ఇద్దరు పిల్లలే. పిల్లలిద్దరికీ పదేళ్ల క్రితమే పెళ్లిళ్ళయ్యాయి. అవధాని పాతికేళ్లు ఆ ఊళ్ళోని ఎలిమెంటరీ స్కూల్లో హెడ్మాష్టరుగా పనిచేసి ఈ మధ్యనే పదవీ విరమణ చేశాడు. అప్పట్నుంచీ ఆ యింకంత ఇంట్లో ఆ ఇద్దరే; ఎప్పుడో ఏ సంక్రాంతికో పెద్దమ్మాయి సుశీల, పిల్లలు వచ్చి ఓ పదిరోజులు ఉంటారు; అంతే! ఆ తరువాత మళ్లీ మామూలే! ఇక భరద్వాజ వచ్చి అప్పుడే ఐదేళ్లు కావస్తోంది.

అవధానిది తాతల నాటి పెద్దయిల్లు. మండువాలోగిలితో పాటు వెనుకా ముందూ పెంకుటిళ్లు. పెరట్లోబావి, ఆ బావి దగ్గర గన్నేరు, మందారచెట్లు, యింకోమూల కొబ్బరి, వేప చెట్లతో యిల్లంతా పచ్చగా ఉంటుంది. నిజానికి ఆ అగ్రహారంలోని యిళ్లన్నీ పచ్చగానే ఉంటాయి. కాకపోతే యిళ్లల్లోని మనుషులే పల్చబడ్డారు. పదేళ్లక్రితం ఆ ఊళ్లో ముఖ్యంగా అగ్రహారం వీధిలో అరవై యిల్లుంటే యిప్పుడు అవి సగానికి పైగా తాళం కప్పలతో బోసిపోయి కనిపిస్తున్నాయి. కొందరు చదువుల నిమిత్తం పట్నం దారి పడితే, యింకొందరు వృద్ధులైపోయి పిల్లల దగ్గరకు వెళ్లిపోయారు. మిగతా సగం యిళ్ళల్లో కూడా కేవలం వృద్ధులే ఎక్కువమంది ఉంటున్నారు. అందులో అవధాని యిల్లు కూడా ఒకటి.

గన్నవరపు నరసింహమూర్తి

ఆ సమయంలో అవధాని యింటికి ఒక యువకుడు వచ్చి "మాస్టారుగారున్నారా"? అంటూ ప్రశ్నించసాగాడు. అతని మాటలు విని లోపల ఉన్న జానకి వరండాలోకి వచ్చింది; అక్కడ ముఖానికి బొట్టుతో పేంటు చొక్కాలో ఒక యువకుడు నిలబడి ఉన్నాడు. ఆమెని చూడగానే రెండు చేతులతో నమస్కరించి "ఇది అవధానిగారి యిల్లే కదండీ" అని అడిగాడు. ఆమె అవునని తలూపి కూర్చోమని కుర్చీ చూపించింది. అతను కుర్చీలో కూర్చుంటూ "నా పేరు శ్రీధర్; నేను ఈ రోజే ఈ ఊరి స్కూల్లో టీచరుగా జాయినయానమ్మా; ఎక్కడుండాలో అని ఆలోచిస్తుంటే హెడ్మాస్టరు రాఘవయ్యగారు అవధాని మాస్టారుగార్ని కలవమని చెప్పారు. అందుకని యిలా వచ్చాను; మీకభ్యంతరంలేకపోతే మీ యిల్లు అద్దెకివ్వమని అడగటానికి వచ్చానమ్మా" అన్నాడు అతను.

అలాగా బాబూ! చాలా సంతోషం! కానీ యిప్పటి వరకు మేమెవ్వరికీ అద్దెకివ్వలేదు. అదీగాక అవటానికి మాది పెద్దయిల్లే అయినా యిది రెండు కుటుంబాలకు బహుశా అనువుగా ఉండదనుకుంటాను. అయినా మాస్టారుగారు దానికి ఒప్పుకుంటారో లేదో" అంది జానకి.

"మాది పెద్ద కుటుంబమేమీ కాదమ్మా! నేను, నా భార్య రాధ; రెండేళ్ల చిన్నబాబు; అంతే; మీరు చెప్పినట్లు మీకు యిల్లు అద్దెకివ్వ వలసిన అవసరం లేదనుకోండి. కానీ ఈ ఊళ్ళో ఒక్క యిల్లు కూడా అద్దెకు దొరకలేదమ్మా. అందుకే తప్పక మీ ఇంటికి వచ్చాను. అందుకనే మీరు పెద్ద మనసు చేసుకొని ఈ సహాయంచేస్తే మీ మేలు మరచిపోను. మీరు మాకు ఒక గది యిచ్చినా చాలమ్మా ఎలాగోలా కాలక్షేపం చేసేస్తాం; మా ఆవిడకు కూడా మీలాగే గొప్ప మడీ, ఆచారం; మీ ఇంటిని శుభ్రంగా ఉంచుతుందని హామీ యిస్తున్నాను. యిక మాస్టారుగారి కైతే మా అబ్బాయి బబ్లూతో రోజల్లా కాలక్షేపం అవుతుంది" అంటూ అతను చెప్పుకు పోతుంటే జానకి శ్రోతే అయింది. అతను చెప్పడం ఆపిన తరువాత "సరే బాబూ! మాస్టారుగారు లేచిన తరువాత నువ్వొచ్చిన విషయం చెప్పి నీకు యిల్లు అద్దెకిచ్చిందీ లేనిదీ రేపు చెబుతాను; సరేనా" అంది ఆమె. "తప్పకుండా నమ్మా! మీరే మాస్టారుగారికి ఎలాగైనా ఒప్పించి యిల్లు ఎలాగైనా యిప్పించేట్లు చూడండి; మరి నే వస్తాను" అంటూ అతను లేవబోతుంటే "ఉండు బాబూ! కాఫీ తాగుదువుగాని" అంటూ లోపలికెళ్లి ఐదు నిముషాల్లో కాఫీ తెచ్చింది. కాసేపటికి అతను కాఫీ త్రాగి వెళ్లిపోయాడు.

అతను వెళ్లిన కొద్దిసేపటికి అవధాని నిద్ర నుంచిలేచాడు. అతనికి త్రాగడానికి మంచినీళ్లిస్తూ "ఇందాక ఎవరో శ్రీధర్ అనీ కొత్త టీచరుగారు మీ కోసం వచ్చాడు. అతను మొన్ననే మనస్కూల్లో జాయినయ్యాడట; అంది జానకి.

"కొత్త టీచరుగారా?! ఎందుకొచ్చాడో కనుక్కున్నావా?" ఆవులిస్తూ అడిగాడు.

"ఆ కనుక్కున్నాను. ఈ ఊళ్లో ఉండటానికి యిల్లే దొరకలేదట; చివరకు హెడ్మాష్టరు గారు మనకు వీలవుతుందేమోనని మిమ్మల్ని కలవమని చెబితే వచ్చాడట"

"మన ఇల్లు అద్దెకా? కుదరదని చెప్పు. అయినా మనం ఎప్పుడైనా ఎవరికైనా యిచ్చామా చెప్పు"

"అది నిజమేననుకోండి. కాని అతన్ని చూస్తుంటే మంచివాడిలా కనిపిస్తున్నాడు; పైగా వాళ్లది చిన్న కుటుంబం అనీ చెబుతున్నాడు. అయినా మనం కూడా యింత పెద్ద యిల్లు ఏం చేసుకుంటాం చెప్పండి. వాళ్లకి యిస్తే ఆ అమ్మాయితో నాకూ, ఆ పిల్లవాడితో మీకు కాలక్షేపం అవుతుంది. మనవలతో ఆడుకోవాలన్న ముచ్చట కూడా మీకు తీరుతుంది" అంటూ ఆమె చెబుతుండగానే మధ్యలోనే అతను కల్పించుకొని "సర్లే! నీకు కాలక్షేపాలు కావాలేమోగానీ నాకలాంటివి నచ్చవు. యిల్లు యివ్వడం కుదరదనీ చెప్పేసెయ్" అంటూ కరాఖండిగా చెప్పాడు అవధాని.

కానీ మర్నాడు శ్రీధర్, భార్య పిల్లాడితో నేరుగా అతనింటికి వచ్చి ప్రాధేయ పడటంతో కొద్దిగా మెత్తపడ్డాడు అవధాని. ఈలోగా తన సహాధ్యాయి, హెడ్మాష్టరు అయిన రాఘవయ్య వచ్చి యివ్వమనీ చెప్పడంతో అవధానికి యిల్లు యివ్వక తప్పింది కాదు.

ఆ మర్నాడే శ్రీధర్ కుటుంబం కొద్ది సామాన్లతో ప్రక్కనే ఉన్న రెండు గదుల్లో దిగిపోయారు.

× × ×

అవధానికి మొదటినుంచీ చిన్నపిల్లల పొడ అంటే గిట్టదు. అప్పుడప్పుడు వచ్చే తన మనవలమీద కూడా వాళ్లు ఏడ్చినప్పుడు విసుక్కుంటూ ఉంటాడు. అందుకే కూతురు భాను సాధ్యమైనంత వరకూ ఒక్కర్తే వస్తుంటుంది. పిల్లల్ని తీసుకొస్తే వాళ్ల అల్లరి వల్ల తండ్రికి కోపం వస్తుందనీ భర్త దగ్గర వదలి వస్తుంటుంది. ఆమెకు చిన్నప్పట్నుంచి తమ తండ్రి మనస్తత్వం బాగా తెలుసు.

స్కూల్లో కూడా అతను పిల్లల అల్లరిని సహించే వాడుకాదు. ఇంట్లో అతనికి ఎప్పుడూ వాతావరణం ప్రశాంతంగా ఉండాలి. చిన్న శబ్దం చేసినా అతనికి నచ్చదు.

అటువంటి అవధానికి యిప్పుడు ఒక విషమ పరీక్ష ప్రక్క వాటాలో దిగిన శ్రీధర్ కుటుంబంవల్ల ఎదురైంది. వాళ్ల రెండేళ్ల కొడుకు బబ్లూ చూడటానికి నిజంగానే బబ్లూగా వుంటాడు. తన ముద్దు ముద్దు మాటలతో, చిలిపి అల్లరితో చిన్ని కృష్ణుణ్ణి తలపిస్తుంటాడు. శ్రీధర్ స్కూలుకి వెళ్లిపోగానే రాధ బబ్లూతో సహా అవధాని యింటికొచ్చేస్తుంది. యిక అప్పట్నుంచి జానకితో ఒకటే కబుర్లు. పనిమనిషి దగ్గర్నుంచీ రాజకీయాలు దాకా వాటికి అంతుండదు. వాళ్లు అలా కబుర్లలో పడగానే బబ్లూ యిల్లంతా కలియ తిరుగుతూ తన చేతికి పని చెబుతుంటాడు.

ఆ రోజు అవధాని తన మడిబట్టను బయట ఆరవేసి ఏటికి స్నానానికి వెళ్లాడు. ఆ వరండాలో ఉన్న టేబులుపై వున్న వ్యాస పీఠంలో భాగవత గ్రంథాన్ని ఉంచాడు. ఏటినుంచి రాగానే పూజాదులు ముగిసిన తరువాత గ్రంథపఠనం అతని నిత్యకృత్యం. కానీ ఏటినుంచి రాగానే అతనికి కనిపించిన దృశ్యం విపరీతమైన కోపాన్ని తెప్పించింది.

బుల్లి బుల్లి అడుగులు వేసుకుంటూ వీధిలోకి వెళ్లిన బబ్లూ పడిపోబోయి ఆ మడి పంచెను పట్టుకోబోతే అది నేల మీదకు జారిపోయి మట్టి అంటుకుంది. అలా ఆ నేల మీద పడిన ఆ చెంగుమీద బబ్లూ కూర్చుని ఆడుకోవడం అవధాని కంటబడింది. ఆ దృశ్యం చూసిన అవధాని ఉగ్రరూపం దాల్చి పరుగున వెళ్లి బబ్లూని ఓ చేత్తో పట్టుకొని అరుగు మీదకు విసిరేసినంత పని చేసి ఆ పంచెను తీస్కొని మళ్లీ ఏటికి వెళ్లిపోయాడు. అంత కోపంతో తనను విసిరేసిన అవధానిని చూసిన బబ్లూ ఒక్క సారిగా గుక్కపట్టి ఏడవడం మొదలు పెట్టాడు. అలా ఏడుస్తూ వాళ్లమ్మ దగ్గరకు పరుగున వెళ్లబోయి అక్కడే నీటి చెంబుని తన్నేయడంతో ఆ నీళ్లు క్రింద ఒలికిపోయాయి. అదే ఊపున టేబుల్‌మీద పడటంతో అది తూలి దాని మీద ఉన్న భాగవతం క్రింద పడింది; అది నీటి మీద పడి తడిసిపోయింది. వాడి ఏడుపు విని రాధ, జానకి పరుగున బయటికి రాగానే వాళ్లకి జరిగిన విషయం అర్థం అయింది. రాధ బబ్లూని ఎత్తుకొని కోపంతో వాళ్ల గదిలోకి వెళ్లిపోయి తలుపులు మూసుకుంది. ఆ తరువాత బయట ఉన్న జానకికి బబ్లూ పెద్ద పెట్టున ఏడవటం వినిపించింది. వెంటనే జానకి పరుగున వెళ్లి తలుపు కొడుతూ "అమ్మాయ్! పిల్లవాణ్ణి కొట్టొద్దు; తలుపుతియ్" అంటూ చెప్పగానే ఆమె తలుపులు తీసింది. ఆ పిల్లవాడితో పాటు ఆమె కంటిలో కూడా నీరు. ఆ దృశ్యం చూసి జానకి చలించిపోయింది.

"అలా పిల్లవాణ్ణి అంతలాగ కొట్టుకుంటారమ్మా ఎవరైనా? అలా చెయ్యకూడదని వాడికేం తెలుసు చెప్పు? అయినా యిప్పుడేం జరిగిందనీ; బాబాయ్‌గారికి కొద్దిగా కోపం ఎక్కువ; అదీ రెండు క్షణాలే; మళ్లీ మామూలైపోతారులే; నువ్వింక వాణ్ణి కొట్టొద్దు" అంటూ పిల్లవాణ్ణి తీసికొని జానకి వాళ్లింట్లోకి వెళ్లిపోయింది. కాసేపటికి పిల్లవాడు ఏడుపు ఆపి జానకి ఒళ్లో నిద్రపోయాడు. అప్పుడు ఆ యింట్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.


ఆ సంఘటన జరిగిన తరువాత రాధ చాలా సేపటి వరకు మామూలు మనిషి కాలేక పోయింది. ఆమె ఆ యింట్లో దిగిన దగ్గర్నుంచీ అవధానిని గమనిస్తోంది. అతనికి చిన్న పిల్లల ఏడుపులన్నా, అల్లరి అన్నా అస్సలిష్టం ఉండదు. అది తెలిసి ఆమె కూడా బబ్లూని సాధ్యమైనంత వరకు అవధానిగారి ఇంటి వైపు వెళ్లకుండా కట్టడి చేస్తోంది. కానీ వాడు అప్పుడే నడకలు నేరుస్తున్న పిల్లవాడు; వాణ్ణి కాపలా కాయడం ఆమెకు బహు కష్టంగా వుంది. కన్ను ఏ మరవగానే అవధాని యింట్లోకి వెళ్లిపోతూ లేనిపోని సమస్యలు తెచ్చిపెడుతున్నాడు.

ఆ రోజు సాయంత్రం శ్రీధర్ స్కూలు నుంచి వస్తూనే అవధాని వదనాన్ని చూసి ఏదో కీడుని శంకించి యింట్లోకి వెళ్లగానే రాధను కారణం అడిగాడు.

ఆమె జరిగిన విషయం చెప్పడంతో అతను కూడా బాధ పడ్డాడు. తాను ఎంతో బ్రతిమాలితేగానీ అతను యిల్లు యివ్వడానికి ఒప్పుకోలేదు. అటువంటిది బబ్లూ వల్ల వస్తున్న కొత్త సమస్యలతో తిరిగి ఇల్లు ఖాళీ చెయ్యవలసిన పరిస్థితి వస్తుందేమోనని ఆ దంపతుల భయం! ఇక అప్పట్నుంచీ అతను స్కూలుకి వెళ్లే ముందు బబ్లూని జాగ్రత్తగా చూడమనీ రాధకి పదేపదే చెబుతుండేవాడు.

ఆ సంఘటన జరిగిన తరువాత రాధ తాను స్నానం చేస్తున్నప్పుడు, వంట చేస్తున్నప్పుడు వాణ్ణి మంచానికి కట్టేసేది. కానీ దానివల్ల మరో సమస్య వాడి భీకరమైన ఏడుపువల్ల వచ్చేది. ఆ ఏడుపు వల్ల అవధానికి మళ్లీ చిరాకు పుట్టుకొస్తుందని ఆమె భయం! మళ్లీ వాణ్ణి వదలగానే వాడు బుల్లి బుల్లి అడుగులు వేసుకుంటూ అవధాని వీపుని పట్టుకొని 'తాత' 'తాత' అంటూ ముద్దు ముద్దు పలుకులతో అల్లరి పెట్టేవాడు. అవధాని కెందుకో ఆ పిలుపు హాయిగా అనిపించేది; కానీ అది ఒక్క క్షణమే. వెంటనే తేరుకొని జానకిని పిలవగానే ఆమె వచ్చి బబ్లూని తీసికెళ్లిపోయేది.

ఒకరోజు అవధాని సాయంత్రం పూట పనిమీద హెడ్మాష్టరు రాఘవయ్య ఇంటికి వెళ్లాడు. కానీ అతనికి తెలియకుండానే అతని వెనకాల బబ్లూ కూడా అక్కడికి చేరుకున్నాడు. అప్పుడు వాణ్ణి చూసిన రాఘవయ్య "అవధానిగారూ! మీకు వాడితో బాగా కాలక్షేపం అవుతున్నట్లున్నది. అందుకే మిమ్మల్ని క్షణం కూడా వదలటం లేదు; పోన్లెండి యిక్కడ మీకు మనవడు లేని లోటుని తీరుస్తున్నాడు" అన్నాడు వాణ్ణి ఎత్తుకుంటూ అవధానికి ఆ మాటలకి కోపం వచ్చినా బాగుండదని 'అవును' అంటూ దాటవేశాడు. తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు ఇష్టం లేక పోయినా వాణ్ణి ఎత్తుకోక తప్పింది కాదు. ఇక ఎత్తుకోగానే బబ్లూ అల్లరి చూడాలి. అతని జుట్టుని లాగడం మొదలు పెట్టాడు. ఇంతలో ఎదురుగుండా వస్తున్న ఎడ్లబండిని చూడగానే భయపడి అతని మెడని గట్టిగా పట్టుకొని వాటేసుకున్నాడు.




అవధానికి ఎందుకో ఆ పిల్లవాడి స్పర్శ చాలా హాయిగా అనిపించసాగింది. అతని శరీరం పులకించసాగింది. ఆ సమయంలో గుమ్మం ముందు ముగ్గువేస్తున్న రాధకు దూరంగా బబ్లూని ఎత్తుకొని వస్తున్న అవధాని కనిపించడంతో ఆ దృశ్యం చూసి ఆమె ఒక్కక్షణం స్థాణువైపోయింది. అవధాని కొంచెం దూరంలో ఉండగానే పరుగున వెళ్లి పిల్లవాణ్ణి తీసుకొని "ఏమైనా అల్లరి చేశాడా బాబాయ్‌గారూ?" అంది భయంగా; అవధాని మారు మాట్లాడకుండా ఇంటిలోకి వెళ్లిపోయాడు.

బబ్లూ అల్లరి వల్ల కోపానికి గురౌతున్న అవధానికి, రాధ కుటుంబానికి మధ్య జానకి నలిగిపోసాగింది. నిజానికి బబ్లూ లాంటి చిన్నపిల్లవాడు ఇటువంటి అల్లరి పనులు చెయ్యడం ఆమె దృష్టిలో పెద్దతప్పేమీ కాదు; అది సహజం. కానీ అవధాని మనస్తత్వం వల్ల ఈ సమస్యలొస్తున్నాయి. బబ్లూ చిన్ని కృష్ణుడిలా తమింట్లో తిరుగుతుండటం ఆమెకు ఎంతో ఆనందం కలిగిస్తోంది. తమ మనవలు ఎలాగూ ఇక్కడికొచ్చి ఉండే అవకాశం లేదు; కనీసం వీడివల్లనైనా ఆ కోరిక తీరుతున్నందుకు ఆమె లోలోపల సంతోషపడుతోంది. కానీ ఈ పరిస్థితి ఎన్నాళ్లో కొనసాగేటట్టు కనిపించటం లేదు.

అలా ఒకనెల రోజులు గడిచాయి. అప్పటికి శ్రీధర్ కుటుంబం వచ్చీ ఆర్నెల్లు అయింది. అప్పటికే వాడి అల్లరితో విసిగిపోయిన అవధాని ఒకరోజు భోజనాల దగ్గర జానకితో అన్నాడు. "జానకీ! ఇల్లు వెంటనే ఖాళీ చెయ్యమనీ మాస్టారిగారితో చెప్పు. వాడి అల్లరి వల్ల ఈ వయసులో నాకు మానసిక ప్రశాంతత కరువౌతోంది"

ఆ మాటలు విన్న జానకి కాసేపు మౌనం వహించింది. తరువాత మెల్లగా" చూడండి! వాళ్లది మంచి కుటుంబం! ముఖ్యంగా ఆ అమ్మాయి మనతో బాగా కలిసిపోయింది. నాకు కన్న కూతురిలా అన్ని పనుల్లోనూ సాయపడుతోంది. అదీగాక వాళ్లు వచ్చిన తరువాత నాకు సమయం తెలియకుండా గడిచిపోతోంది. ఇలా ఆ పిల్లవాడి వల్ల వాళ్లని ఖాళీ చేయమనడం తప్పేమోననిపిస్తోంది నాకు. అప్పటికీ వాళ్లు మీ బాధని అర్థం చేసుకొని వాడిని బాగానే కట్టడి చేస్తున్నారు. ఏ దైనా వాడు చిన్నపిల్లవాడు. ఈ వయసులో ఆపాటి అల్లరి సహజం! మనమే కొద్దిగా సహనం వహిస్తే కొన్ని రోజులకి అన్నీ సర్దుకుంటాయని నానమ్మకం" అంటూ అవధానికి సర్దిచెప్పడంతో అతను మరేమీ మాట్లాడకుండా భోజనం చేసి వెళ్లిపోయాడు.

కానీ అనుకోని విపత్తు మరోవారం రోజుల తరువాత వచ్చిపడింది. ఆ రోజు అవధాని స్నానానికి ఏటికి వెళ్లగానే బబ్లూ మెల్లగా ఆ యింట్లో ప్రవేశించాడు. ఆ సమయంలో జానకి పూజగదిలో ఉంది. బబ్లూ నేరుగా టీవీ టేబుల్ దగ్గరకు వెళ్లి దాని వైరుని గట్టిగా లాగడంతో అది జారి క్రిందకు పడిపోయింది. ఆ శబ్దం విని జానకి, రాధ పరుగెత్తుకు వచ్చారు. అదృష్టవశాత్తు బబ్లూకి దెబ్బలేం తగల్లేదుకానీ టీవీ మాత్రం పనిచెయ్యలేదు. ఆ సంఘటన చూసిన జానకి మనసు పరి పరి విధాలుగా ఆలోచించసాగింది. ఇప్పుడు అవధాని కోపాన్ని ఆపడం ఎవరితరం కాదు; సాయంత్రం కాగానే అతనికి ఆ టీవీయే కాలక్షేపం. మొన్ననే అది పాడైతే రెండువేల రూపాయలు పెట్టీ బాగుచేయించాడు; ఇక రాధకైతే మెదడు మొద్దుబారి పోయింది;

ఆ సమయంలో ఆ యింట్లో బబ్లూ ఏడుపు తప్ప ఏవీ విన్పించటం లేదు. జానకి, రాధలిద్దరూ బిక్కుబిక్కుమంటూ అవధానికోసం ఎదురు చూడసాగేరు. ఈ సంఘటనలతో సంబంధం లేని గడియారం మాత్రం తన పని తాను చేసుకుపోతోంది.

× × ×

శ్రీధర్, రాధ అవధాని గారి ఇల్లు ఖాళీ చేసి అప్పుడే పదిహేను రోజులవుతోంది. ఆ రోజు అవధాని ఇంటికి రాగానే విషయం తెలుసుకొని ఆవేశంతో ఊగిపోయాడు; అంతే ఆవేశంతో "అమ్మాయ్!" అంటూ బిగ్గరగా పిలిచాడు. ఆ భీకరమైన పిలుపు విని రాధ బిక్కు బిక్కు మంటూ వాళ్లింటికి వెళ్లింది. ఎదురుగా ఆవేశంతో ఊగిపోతున్న అవధానిని చూడగానే ఆమెకు ముచ్చెమటలు పోశాయి. "చూడమ్మా! ఆ

రోజు ఎక్కడా మీకు ఇల్లు దొరకలేదంటే నా మనోభిష్టానికి వ్యతిరేఖంగా ఈ ఇంటిని మీకిచ్చాను. కానీ చివరికేం జరిగింది?! మీరు వచ్చిందగ్గర్నుంచి నాకు ప్రశాంతత కరువైంది. ఏదో పదవీ విరమణ చేసిన తరువాత జీవితాన్ని ఏ బాదరాబందీ లేకుండా గడుపుదామనుకున్నాను. కానీ అది కుదరలేదు. ఇదేం అజాగ్రత్త వల్ల జరగిందని నేను మిమ్మల్ని తప్పు పట్టటం లేదు. చిన్న పిల్లవాడుంటే ఇవి సహజం; ఈ సమయంలో ఉన్నపళాన మిమ్మల్ని ఖాళీ చెయ్యమనడం భావ్యం కాకపోయినా తప్పదు. దయచేసి నా బాధని అర్థం చేసుకోండి! అంటూ చేతులు జోడించాడు అవధాని.

ఆ తరువాత సంఘటనలు త్వరత్వరగా చోటుచేసుకున్నాయి. శ్రీధర్ ఇంటికి రావడం, జరిగిన విషయాలు తెలుసుకొని అవధానిగారికి క్షమాపణలుచెప్పడం, ఆ మర్నాడు టీవీని పట్నం తీసికెళ్లి బాగు చేయించడం, అక్కడే మరోయిల్లు అద్దెకు తీసుకోవడం, మర్నాడే సామాన్లతో పట్నం వెళ్లిపోవడం ఒక దాని వెంట ఒకటి చకచకా జరిగిపోయాయి.

ఆ పల్లెలో సరియైన ఇల్లు దొరక్క ఆ పట్నంలో ఇల్లు తీసుకోక తప్పింది కాదు ఆ కుటుంబానికి. శ్రీధర్ రోజూ బస్సులో ఆ పల్లెకు వెళ్లి వస్తున్నాడు. ఇప్పుడు రాధకి బబ్లూతో ఆ యింట్లో ఏ సమస్యా లేదు. ఎందుకంటే ఆ ఇంటి చుట్టుప్రక్కల ఎవరిళ్లూ లేవు. అక్కడ ఇళ్లన్నీ దూరంగా విసిరేసినట్లున్నాయి. బబ్లూ కూడా ఇళ్లు దూరంగా ఉండటం వల్ల ఎక్కడికీ వెళ్లటం లేదు. కాని రాధకే జానకమ్మ గుర్తుకొచ్చీ చాలా బాధ వేస్తుంటుంది. నిజానికి అవధానిగారి కుటుంబం చాలా మంచిది. జానకమ్మైతే సరేసరి; అమృత హృదయురాలు. తల్లిలా తనని ఆదరించింది. ఒక విధంగా అవధానిగారు కూడా మంచివారే. కాకపోతే వయసురీత్యా, మనస్తత్వరీత్యా కొద్దిగా కోపిష్టి. ఏదైనా తమ దురదృష్టమనీ ఆమె వాపోసాగింది.

ఆ రోజు శ్రీధర్ స్కూలుకెళ్లగానే రాధయింటి పనులన్నీ పూర్తి చేసింది. బబ్లూకి స్నానం చేసి వాడికి ముస్తాబు చేస్తుంటే తలుపు చప్పుడైంది. ఈ సమయంలో తమింటికి ఎవరొస్తారని ఆలోచిస్తుండగా మళ్లీ చప్పుడవడంతో పిల్లవాణ్ణి ఎత్తుకొని వెళ్లి తలుపు తీసింది.

తలుపు తీయగానే ఎదురుగా ఉన్న నిలువెత్తు విగ్రహాన్ని చూడగానే ఆమె నిశ్చేష్టురాలైంది. గుమ్మం ముందు పంచె, లాల్చీ, చేతిలో సంచితో అవధాని నిలబడి ఉన్నాడు. అతన్ని చూడగానే ఆమెకు నోటమాట రాలేదు. తరువాత యిది నిజమేనా? అన్న అనుమానం వచ్చింది. అంతలోనే తేరుకొని 'రండి



ప్రముఖ కవి ఇస్మాయిల్ ఆరవ సంస్మరణ సభను కాకినాడలో నవంబర్ 22న ఇస్మాయిల్ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలో నామాడి శ్రీధర్ కవితా సంపుటి 'ఇంధన ఛాయ'ను ఇస్మాయిల్ కవితా పురస్కారం ప్రదానం చేశారు. ఇంకా ఇస్మాయిల్ మిత్రమండలి ఆహ్వానసంఘం సభ్యులు శ్రీమతి ఎన్. సంధ్యాదేవి, డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి, డాక్టర్ పతంజలిశాస్త్రి, నామాడి శ్రీధర్, కొప్పర్తి, డాక్టర్ ముత్యాల సత్యనారాయణ, గుడిపాటి తదితర కవులు, రచయితలు.

# ఈ నెల మాటలు

**శ్రీమతి జంధ్యాల కిరణ్మయి**


1. సాంప్రదాయాన్ని పాటించుట మనందరి కర్తవ్యంగా భావించి ఆచరించాలి.
2. ఆదాయంలో పదిశాతం వస్తురూపేణా పేదలకియ్యండి అదే మాధవసేవ.
3. జాతిరత్నం ధరించడం కాదు. జాతిరత్నంగా మారి దేశసేవ చెయ్యండి.
4. ఎదిగిన కొద్దీ ఒదగడమంటే ఏ స్థితిలోనూ మనస్థాయి మర్చిపోకూడదు.
5. మనం ఎవరికి సహాయం చెయ్యాలంటే మనకి తిరిగి చెయ్యలేనివారికి
6. సుఖాన్ని పంచుకుంటే పెరుగుతుంది. దుఃఖాన్ని పంచుకుంటే తరుగుతుంది.
7. కులమతాలనే, విభేదాలు మన దృష్టిలోనే తప్ప సృష్టిలోనే భేదం లేదు.
8. విజయం కోసం చేసే యుద్ధంకన్నా విలువల కోసం చేసే పోరాటం మిన్న.
9. ఎక్కువ మందిపై ఆధారపడితే ఎక్కువ నిరాశ పడాల్సి వస్తుంది.
10. చిరునవ్వు కొత్త సృష్టిని చేస్తుంది. అలసినవారికి విశ్రాంతినిస్తుంది.
11. సంతోషమే కాదు దుఃఖం కూడా ఆ మనసును తేలిక పరచి సుఖాన్నిస్తుంది.
12. ప్రతీ అక్షరాస్యుడూ సాహిత్యం చదవడు. సమాజం పూర్తి అక్షరాస్యం కాదు.
13. ఏదో ఒక ఫలితంకోసం ఏర్పడే స్నేహం కలకాలం నిలవదు.
14. సంస్కృతం ఒక దేవభాష ప్రార్థనవంటిది. దాని అందం దర్జా అనుభవించాలి.
15. తెరిచిన కళ్లముందుకన్నా మూసిన కళ్లకి అద్భుత దృశ్యం కన్పిస్తుంది.
16. ఎవడిచావు వాడి జీవితానికి ప్రళయం లేక సునామీ వంటిది.
17. అతిథి శ్రీమన్నారాయణుడని తెలుసు. మరి అధిక ధరలో?

బాబాయ్ గారు. రండి' అంటూ పరుగున లోపలికెళ్లి అతను కూర్చోవడానికి మంచం వేసింది. ఆమె వెనుకనే అవధాని లోనికి వెళ్లి మంచం మీద కూర్చున్నాడు. ఆమె పరుగున లోనికి వెళ్లి అతనికి గ్లాసుతో మంచినీరు తెచ్చిచ్చింది. అతను నీరు త్రాగిన తరువాత అడిగింది. బాగున్నారా బాబాయ్‌గారూ! పిన్నిగారు ఎలాగున్నారు? నిజానికి నేనే వచ్చే ఆదివారం మీ ఇంటికి వద్దామనుకుంటున్నాను. ఆ రోజు తొందర్లో ఇక్కడికి రావలసి రావడంతో పిన్నిగారితో సరిగ్గా చెప్పడమే కుదర్లేదు “అంటూ ఏదో మాట్లాడసాగింది. ఆమె మాటలు విన్న అవధాని నోరు తెరవలేదు. అక్కడ సూది మొనపడితే వినిపించేటంతటి నిశ్శబ్దం! ఐదు నిముషాల తరువాత అతను నోరు తెరిచాడు.

“ఆ రోజు మిమ్మల్ని ఖాళీ చెయ్యమని చెప్పి నేను చాలా తప్పుచేశానమ్మా! నిజంగా మీరు లేని లోటు మీరు వెళ్లిపోయిన తరువాత తెలిసింది. నాకు స్వంత కూతురు ఉన్నా నీ అంత స్వతంత్రంగా నాతో మాట్లాడి ఎరుగదు; అలాగే నువ్వు ఎప్పుడు పిన్నీ, బాబాయ్‌గారు అంటూ మా ఇంట్లో తిరుగుతుంటే నా కూతురే మా ఇంట్లో తిరుగుతున్నంత హాయిగా ఉండేది. మొదటినుంచీ నాది ఒంటరి మనస్తత్వం. కోపం కూడా ఎక్కువే. అందుకే నా పిల్లలుగానీ, మనవలుగానీ నా దగ్గరకు వచ్చేవారు కారు. అటువంటిది బబ్లూరాగానే అన్నీ మారిపోయాయి. వాడు మా ఇంట్లో కలియ తిరుగుతుంటే ఆ చిన్ని కృష్ణుడే మా ఇంటికి వచ్చినట్లు భ్రమపడేవాణ్ణి. కానీ నా మనస్తత్వంతో రాజీపడలేక కోప్పడేవాణ్ణి”; అలా చెప్పుకు పోతూ మధ్యలో ఆగాడు; కొద్దిగా మంచినీరు త్రాగి మళ్లీ చెప్పడం మొదలు పెట్టాడు.

“మీరు వెళ్లిన మర్నాటి నుంచి మీ పిన్ని నాతో మాట్లాడటం మానేసింది. నాకు కూడా బబ్లూ బాగా అలవాటైపోయి రోజూ వాడే గుర్తుకు వచ్చేవాడు. వాడి అల్లరితో, చిలిపి చేష్టలతో, తరచూ నా దగ్గరకు రావడం వల్ల కలిగే స్పర్శతో ఈ కఠినశిల కరిగిపోయి మంచు శిలగా మారిపోయిందమ్మా! నిజానికి నాలో ఈ పరివర్తనకు మీ కుటుంబమే కారణం. రానీ ఇంతలో అతను చెబుతూ మధ్యలో ఆయాసంతో ఆగిపోయాడు. అవధాని కంట్లో సన్నటి తడిని అప్పుడు గమనించిందామె.

అతను కాసేపటికి తేరుకొని బబ్లూని పిలిచాడు. వాడు అతని దగ్గరకు వెళ్లేసరికి ఒక్కసారిగా ఎత్తుకొని ముద్దాడేడు. “అమ్మా! మీరు ఈ రోజే ఇల్లు ఖాళీ చేసేయండి; శ్రీధర్ వస్తే నేను అతనికి నచ్చ చెబుతాను; ఇంకెప్పుడు ఈ బాలకృష్ణుడి మీద ఈ తాత కోప్పడడనీ హామి ఇస్తున్నాను. మిమ్మల్ని అక్కడకు తీసుకురాకుండా నన్ను ఒంటరిగా రావద్దని మీ పిన్ని హెచ్చరించి మరీ పంపించింది” అన్నాడు అవధాని; అతని మాటలు వింటున్న రాధ కళ్లల్లో సన్నటి కన్నీటి పొర; వెంటనే తేరుకొని “తప్పకుండా వచ్చేస్తాం బాబాయ్ గారూ! మీకు మడిగా వండుతాను. భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకోండి; ఈలోగా ఆయన వచ్చేస్తారు. అందరం కలిసి ఆఖరి బస్సుకి వెళ్లిపోదాం” అంది చెమర్చిన కళ్లతో. ఆ మాటలు విన్న అవధానికి ఒక్కసారిగా తనువు పులకరించింది.




కవిత

# జగత్కాంక్ష

జగద్ధాత్రి

ఆగమించే ప్రతి వసంతమూ
నాకొక నిరీక్షణా దీక్షావ్రతమే
అనంతంగా సాగే నీ కవన యజ్ఞంలో
ఛాయా మంత్రంగానైనా నేనగుపిస్తానా అని
అనుక్షణమూ అంతర్మథనమే
కుముదంలా నాగురించి కథరాయమని
అభిమానం విడిచి అర్థించనుగానీ
నా అస్తిత్వాన్ని నీవు అక్షరీకృతం చేయాలని
అంతరాంతరాలలో ఆరాటపడతాను
నా అనుసృజన పల్లకిలో
చిరుపదరత్నమై పల్లవించాలని
గ్రీష్మానుతాపంతో పరితపిస్తాను
నవ రసాల అభివ్యక్తి నిండిన
ఆషాడ మేగపు నా హృది
నాకోసం ఓ కవితాబిందువు చిలకరించాలని
అర్తజగతినై ప్రతీక్షిస్తాను
తరలివచ్చే హేమంతపు దివ్యపరిమళాలలో
చేమంతుల సీమంతినిగా
నీ మాటల మధురిమకోసం కాచుకునుంటాను
ఆకులుగా ఆశలన్నీ రాలిపోయేవేల
మంచుముత్యాల శీతల హేలలో
నన్నుగురించి వెచ్చని ఓ ఆప్తవాక్యం రాస్తావేమోనని
ఓడని మోడునై కనురెప్పగాస్తాను
ఆరు రుతువుల వర్తులం
నిస్తేజంగా, నిర్లిప్తంగా ఆవర్తించాక
నా కన్నీటి నిరాశా ఫలిత పత్రాలను విడిచి
పాత కోర్కెల సరికొత్త పూతలతో
తొగరు లేచివురునై అంకురిస్తాను
ప్రతి రుతువు చక్రభ్రమణమూ
ఆత్మీయానురాగంతో నీవు
నాగురించి రాసే
ఒక్క, ఒకే ఒక్క అక్షరం కోసం
ఆశనిరాశల అంతరీక్షణతో
అనవరతమూ ఆకాంక్షిస్తూనే వుంటాను
నీ దివ్యానుగ్రహ అక్షరహారాన్ని ధరించే
అర్హురాలిని కావాలని
ఆయువిచ్చిన ఆయనులన్నీ
అవిశ్రాంతంగా ఎదురుచూస్తూనే వుంటాను
నీ అక్షరంతో అక్షరమవ్వాలని...
నా చిరంతన కాంక్ష!!